

# 9. భద్రత

ధనలక్ష్మి అందంగా ఉండదని సుజాతకు అనుమానం కాదు నమ్మకమే ! ప్రియుల భార్యలు అందంగా ఉంటారని ఆమె చదివిన నవలల్లో, కథల్లో ఎక్కడా లేదు. చదువూ, అందమూ, ఆరోగ్యమూ లేక పిల్లలకోళ్ళలా ఉంటూ చీటికి మాటికి అందరిమీదా అరుస్తూ జుట్టు వేలిముడేసుకుని పొద్దస్తమానం ఏబ్రాసిలా వుండే భార్యలున్న భర్తలే బయట తనలాంటి అందమైన ఆడవాళ్ళ కోసం వెతుకుతారని సుజాతకు ఎందుకోగాని నమ్మకం.

అందుకే సుజాత రాజారావుని "మీ ఆవిడ అందంగా వుండదా ?" అనే ప్రశ్న అడగలేదు. అసలావిడ గురించి తెలుసుకోవాలని అనుకోలేదు.

రాజారావుకి తనంటే ఆకర్షణ వుందని తెలిసినప్పటినుంచీ సుజాత ఆ ఆకర్షణను పెంచటానికి దోహదపడే పనులన్నీ చేసింది. అతను తనవైపుకి వేసే ప్రతి అడుగునీ గమనించి సానుకూలంగా మరో అడుగు ముందుకి వేసింది. అతనికి నలభై ఏళ్ళనీ, పెళ్ళయిందనీ, యిద్దరు పిల్లలనీ సుజాతకు తెలుసు. అయినా సరే ఆమె అటువైపే నడిచింది. ముప్పయ్యైదేళ్ళ జీవితంలో సుజాత యిలాంటి ఆకర్షణల నుండి యిరవై సార్లు సురక్షితంగా బైటపడింది. ఇరవయ్యొకటోసారి అలా బైటపడాలనిపించలేదామెకు,

"ఎందుకు బైటపడాలి? అతనికి తనలాంటి అందమైన చురుకైన తెలివైన స్త్రీ కావాలి. ఆ స్త్రీ ప్రేమ కావాలి. అందుకే తనకు చేరువవుతున్నాడు. ఇన్నాళ్ళ తన పతిలేని పాతివ్రత్యానికి ఏం మిగిలింది? కన్యగా పవిత్రంగా ఉన్నందుకు ఎవరు మెచ్చి మేకతోలు కప్పారు? రావల్సిన పుకార్లు రానే వచ్చాయి. పడవలసిన నిందలు పడనే పడింది. కార్చవల్సిన కన్నీళ్ళు కార్చేసింది. ప్రేమ, ఒక మగాడితో సంబంధం, వీటి గురించిన అనుభూతులనూ అనుభవాలనూ తనెందుకు నిరాకరించాలి? ఈ ఆలోచనతో సుజాత ఈసారి సందేహాలకు తావివ్వకుండా రాజారావుని తన జీవితంలోకి ఆహ్వానించింది.

ఈ సంబంధంలో వున్న సుఖం, సంతోషం ఎంత అని తనను తాను ప్రశ్నించుకోవాల్సిన రోజొకటి వస్తుందని సుజాతకు మనసులో ఓ మూల తెలిసి వున్నా ఆ రోజు ఇంత తొందరగా వస్తుందని మాత్రం అనుకోలేదు. ఒక మగవాడికి రెండో స్త్రీగా ఉండటంలో యింత శోభ ఉంటుందని సుజాత అనుకోలేదు. మొదటి రోజుల్లో చాలా సంతోషంగానే ఉండేది. రాజారావుని ఆకర్షించాననే గర్వం, కొత్త సంబంధంలోకి వెళ్ళిన ఉత్సాహం సుజాతని సంతోషపెట్టాయి. రాజారావు తప్ప మరో ఆలోచన లేకుండా కొన్ని రోజులు గడిచిపోయాయి. అతను కనిపించనంతసేపూ సుజాతకు అతనెప్పుడు కనిపిస్తాడా అన్న ఆలోచనే. దానితో మరింకో విషయం ఆమె మనసుకెక్కేది కాదు. క్రమంగా ఆ ఆలోచనతోపాటు అతనెప్పుడూ తన దగ్గరే ఎందుకుండడు అనే అసంతృప్తి, అతని కోసం తను ఎదురుచూస్తున్నంతగా తన దగ్గరకు వచ్చే అవకాశం కోసం అతను ఎదురుచూస్తున్నాడా అన్న అనుమానం సుజాత మనసులో తీగ పాకినట్టు పాకటం మొదలెట్టి క్రమంగా పందిరిలా దట్టంగా అల్లుకుపోయింది. అప్పటినుంచీ సుజాతకు ఏదో బాధ మనసుని తొలిచేస్తున్నట్టే వుండేది. రాజారావుకి తనూ, తన ప్రేమా అవసరం అన్న ధీమా తగ్గిపోయి క్రమంగా రాజారావూ అతని గురించిన ఆలోచనలే సుజాతకు జీవనాధారం అయిపోయాయి. అయితే ఆ ఆలోచనల వల్ల ఆమె శక్తి హీనురాలై పోవటం తప్ప పిసరంత సంతోషంగానీ బలం గానీ వచ్చేది కాదు.

చివరకు రాజారావు సుజాత దగ్గరకు తరచుగా రాలేకపోవటానికి చెప్పే కారణాల్లో ఒక్కటి కూడా నమ్మలేకపోయే స్థితికి వచ్చింది. అతను రానప్పుడల్లా పిల్లల అనారోగ్యమనీ, తన భార్య ధనలక్ష్మికి ఈ విషయం తెలిసినట్లుందనీ చెబుతుంటే

సుజాత గుండె మండిపోయేది. తను ముఖ్యం కాదా ఇతనికి అనిపించి కన్నీరు కార్చేది. "అతను నా సొత్తు, నా దగ్గరే వుండాలి. నా చేతులు దాటి పోగూడదు. ఎలా ?" ఈ ఆలోచనలతో సుజాత బుర్ర పిచ్చెక్కిపోయేది.

అంతకుముందు తీరిక దొరికినప్పుడల్లా లైబ్రరీలకు వెళ్ళే సుజాత బ్యూటీ పార్లర్‌కు వెళ్ళసాగింది. స్నేహితులతో సినిమాలకూ షికార్లకూ వెళ్ళటం మానేసింది. ఎప్పుడు రాజారావు వస్తాడో అని ఎదురుచూస్తూ యిల్లు కదలటమే మానేసింది. ఒక్కత్తే అయినా కాస్త విశాలంగా యింటిముందు తోట వున్న యిల్లు అద్దెకు తీసుకుని ఆ తోటనూ, యింటినీ అందంగా తీర్చిదిద్దే సుజాత వాటిని అశ్రద్ధ చేయసాగింది. రాజారావు వచ్చినప్పుడు ఎవరూ ఉండకూడదని స్నేహితులను తన యింటికి ఆహ్వానించటం, రకరకాల చర్చలతో కాలక్షేపం చెయ్యటం మానేసింది. స్నేహితుల పిల్లలతో ఆడుకోవటం, ఆ పిల్లలకు పాటలు నేర్పటం మానేసింది. వాళ్ళ యిళ్ళకు వెళ్ళటమే తగ్గించేసింది. సమయమంతా రాజారావు గురించి ఎదురుచూడటానికో, బాధపడటానికో, అతనితో కలిసి గడపటానికో సరిపోతోంది. విశాలంగా విస్తరించుకుని రకరకాల సజీవ సంబంధాలతో కళకళలాడే సుజాత జీవితం క్రమంగా కుంచించుకుపోయి యింటికే పరిమితమయిపోయింది. ఇంట్లో కూడా సంతోషంగా వుండే సమయం చాలా తక్కువయింది.

క్రమంగా సుజాతలో అశాంతి హెచ్చింది. రాజారావు తనకే దక్కాలనే పట్టుదల పెరిగింది. మొదట్లో తనేమాత్రం పట్టించుకోని, తన ఆలోచనల్లోకి రాని ధనలక్ష్మి యివాళ సుజాతకు ప్రత్యర్థి అయికూచుంది. రాజారావు కంటే ధనలక్ష్మి గురించే ఎక్కువ ఆలోచించే స్థితికి వచ్చింది సుజాత. ఎలాగైనా ఆమెనుంచి రాజారావుని విముక్తం చెయ్యాలి. అక్కడ రాజారావుకేమీ సుఖంలేదు అనుకుంది. తను వండే వచ్చీ రాని వంటకాలను కూడా అపురూపంగా తినే రాజారావుని చూస్తే ధనలక్ష్మి వండి వార్చే ఇల్లాలుగా కూడా విఫలమయిందని అర్థమయింది. అన్ని రకాలుగా తనే రాజారావుని సుఖపెట్టగలిగినపుడు, సుఖపెడుతున్నపుడు అతను తన సొంతం ఎందుకు కాకూడదు ?

ధనలక్ష్మినుంచి విడాకులు తీసుకోమని మొదట కాస్త బెరుకుగా సందేహంగా అడిగిన సుజాత క్రమంగా అది తన హక్కన్నట్లు దబాయించి అడగటం మొదలెట్టింది. రోజులు గడుస్తున్నకొద్దీ సుజాత మాటలు రాజారావుకి సాధింపులుగా

అర్థమవటం మొదలయింది. అతను చిరాకుపడేవాడు. సుజాత ఏడ్చేది. అతను వెళ్ళిపోయాక అశాంతిపడేది. తన ఒంటరితనంమీద తనకే జాలిపుట్టుకొచ్చి కన్నీళ్ళు కార్చేది. ఆ కన్నీళ్ళు కారిన తర్వాత మసురుపట్టిన మబ్బులా వుండే మనసుతో దయనీయంగా కనిపించేది. ఈ దిగులుతో క్రమంగా చిక్కిపోసాగింది.

ఈ పరిస్థితిని సుజాత స్నేహితులు గమనించారు. సుజాత దగ్గరి స్నేహితురాలు గీత ఒకరోజు వచ్చి అసలు విషయమేమిటో చెప్పమని పట్టుబట్టింది. సుజాత పరిస్థితి కూడా ఎవరో ఒకరితో చెప్పుకోనిదే యిక భరించలేనట్టుగానే ఉంది. అందుకే గీత వచ్చి "ఏంటి నీ దిగులు? ఏ రాజకీయ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నావు" అని గుచ్చిగుచ్చి అడుగుతుంటే దాచుకోలేక ఉన్నదున్నట్టు చెప్పేసింది. గీత తనను చెడామడా తిడుతుందనో లేపోతే తనతోపాటు దిగులు పడటానికి సిద్ధమవుతుందనో అనుకుంది. గీత కాస్త కామన్‌సెన్సు వున్న మనిషి. అందుకని సుజాత చెప్పింది శ్రద్ధగా విని సుజాతకు కాస్త మనశ్శాంతిని యిచ్చే మాటలు చెప్పాలని ఆలోచించింది. జరిగిందానికి తిట్టడంవల్ల ప్రయోజనం లేదు. ఇదిగో యిక యిలా చెయ్యి అని తనేదో తీర్పు చెప్పటం పద్ధతి కాదు అనుకుంది గీత.

"నువ్వు చాలా తెలివితక్కువగా ఉన్నావు" అంది.

"నిజమే" నిర్లిప్తంగా అంగీకరించింది సుజాత.

తను రాజారావుతో సంబంధం పెట్టుకోవటమే తెలివితక్కువతనం అనుకుంటోంది సుజాత ఆ క్షణాన. గీత అది పెద్ద తెలివితక్కువతనం కాదులే అంది.

"నువ్వు ఏ ఆకర్షణలకూ లొంగకుండా నిగ్రహంగా యోగినిలా వుండలేదని కాదు నా బాధ. అట్లా వుండటమే గొప్ప అని కూడా నేను అనుకోను. కానీ నువ్వు రాజారావు నీ సొంతం కాలేదని బాధ పడుతున్నావే - అది తెలివితక్కువతనం నా ఉద్దేశంలో. నీకున్న మిగిలిన అన్ని స్నేహసంబంధాలవంటిదే యిదికూడా అనుకుంటే నీకీ బాధ తప్పేది గదా. నేను నీ స్నేహితురాలిని. నీతో కలిసి మాట్లాడటం బాగుంటుందనుకున్నపుడు వస్తాను. ఇద్దరం కలిసి ఎన్నో విషయాలు పంచుకుంటాం. నేర్చుకుంటాం. సరదాగానూ కాలం గడుపుతాం.ఇద్దరికీ హాయిగా సమస్య లేకుండా ఉన్నంతసేపే కలిసి గడుపుతాం. అలాంటి సంబంధమే రాజారావుది కూడా అనుకుంటే నువ్వు ఈ అశాంతినుంచి బైటపడేదానివి. ఇప్పుడు చూడు నీకు యిదివరకున్న అన్ని ఆనందాలూ పోయాయి, అతని ఆలోచన తప్ప మరోటి లేదు. జీవితం

అశాంతిమయం చేసుకున్నావు. మనిషివి చిక్కిపోతున్నావు. ఒక వ్యక్తితో సంబంధం నిన్నిలా చేసిందంటే దానర్థం ఏమిటి? మనమొక స్నేహంలోనో, ప్రేమలోనో వున్నామంటే దాన్నుంచి మనకు గొప్ప ఆనందం కలగాలి. కష్టాలు వస్తే దాటొచ్చు. కానీ అసలు మొత్తం అంతా అశాంతి, దుఃఖం అయిపోతే, ఆ సంబంధం మన జీవితాన్ని కాస్తన్నా విశాలం చెయ్యకపోతే, మన జీవితం కొత్త మార్పులతో ఉత్సాహభరితం కాకపోతే ఆ సంబంధం గురించి తప్పకుండా ఆలోచించాలి. నీకు యింతకుముందున్న ఆత్మవిశ్వాసం పోయింది. నీకింతకుముందు ఏదో పోగొట్టుకుంటానేమోనన్న భయం లేదు. అసలయినా ఈ సంసారపు రొంపిలో చిక్కుకోకుండా నువ్వు హాయిగా బతుకుతున్నావని అసూయపడుతుంటే నువ్వు ఆ రొంపికోసం తాపత్రయపడుతున్నావు. నీ బాధ చాలా అర్థరహితం. ఆ రాజారావుకి పెళ్ళయిందని తెలిసే అతన్తో సంబంధం పెట్టుకున్నావు గదా! అతను నీ సొంతం కావటమంటే చేతులారా ఎంతో బరువుని నెత్తికెత్తుకోవటమే, నీకెందుకా బరువు? నాకర్థం కావటం లేదు?" గీత ఏకధాటిగా తను చెప్పాలనుకున్నదంతా చెప్పేసింది.

"నాకూ అర్థంకావటంలేదు. కానీ రాజారావు నాకు సొంతం కావాలి నా మనిషి కావాలి అనేకోరిక మాత్రం పాపం పెరిగినట్లు పెరిగిపోతోంది"

"అతనివల్ల పిల్లల్ని కనాలని...." సాలోచనగా చూసింది గీత.

సుజాత నవ్వేసింది.

"ఆ అవకాశం లేదు. అతను ఆపరేషన్ చేయించుకున్నాడు"

"మరి ఎందుకు కోరికోరి పెద్ద సుడిగుండంలోకి దూకుతున్నావు? అతను నువ్వే కావాలనుకుంటే విడాకుల కోసం పెద్ద యుద్ధం చెయ్యాలి. ఆ యుద్ధంలో వచ్చే కష్టనష్టాలన్నిటికీ నిన్నే బాధ్యురాలిని చేస్తాడు. నిన్ను నిందిస్తాడు. ఆ క్రమంలో మీ యిద్దరి మధ్యా ఎడం పెరుగుతుందే కాని తరగదు. ఆ తర్వాత నువ్వతనికి పిల్లల నుంచి తనను దూరం చేసిన వాంప్‌లా కనపడతావు. పిల్లల్ని అతనొదులుకోడు. పిల్లలెక్కడ దూరమవుతారో అనే భయంలో వాళ్ళకు మరింత దగ్గర కావటానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో నీకు బాగా దూరమవుతాడు. మీ సంబంధం తెగిపోక తప్పదు. అసలతనికి భార్యనుంచి విడిపోవటమే యిష్టంలేకపోతే నీ సాధింపులు భరించలేక నీకు దూరమవుతాడు. అది నీకు సుఖమని నా ఉద్దేశమనుకో- నీ అంతట నువ్వు అతనికి బందీగా మారాలని కోరు

కుంటున్నావు.అది నీకు అర్థం కావటంలేదు" అంటూ గీత చాలాసేపు గీతోపదేశం చేసి వెళ్ళింది.

కానీ బాగా కాలిన పెనంమీద పడిన నీటిచుక్కలా ఆ మాటలు సుజాత బుర్ర కెక్కలేదు. సుజాత మనస్సు మాత్రం పొయ్యి మీద వున్న పెనంలాగే మండసాగింది. ఆ మంట యిప్పట్లో చల్లారేది కాదు. ఆ మంట మండించుకోవటంలో తనేమన్నా సుఖం కనిపెట్టిందా అనే అనుమానం కూడా సుజాతకు వచ్చింది.

ఈ అనుమానంతో మనసు మరీ చికాకై సుజాత విశ్లామందిరానికి వెళ్ళింది. దైవ దర్శనం, చల్లగాలి, ప్రశాంత వాతావరణం మనసుని కాస్తంత బాగు చేస్తాయని ఆశపడింది. కానీ ఆశ ఫలించలేదు. దైవదర్శనం ఏమీ ఉపయోగపడలేదు సరిగదా క్యూలో నుంచుని నుంచుని కాళ్ళు పీకాయి. ఆ రోజు శనివారం అని గుర్తు లేనందుకు తనను తాను తిట్టుకుంటూ ఆ చికాకులో దేవుడిని సరిగా చూడనైనా చూడలేదు. చల్లగాలి సంగతి చూద్దామని పక్కనే వున్న మొక్కల దగ్గరకు వెళ్ళి కూచుంది.

ఆ సాయంత్రం చాలామందికి చల్లగాలితో అవసరమున్నట్లుంది. ఆ ప్రాంత మంతా జనంతో సందడి సందడిగా వుంది. పిల్లలు తిరుగుతూ ఆడుతూ పెద్దవాళ్ళ మీద పెత్తనం చేస్తూ, వాళ్లను కంగారు పెడుతూ ఆనందిస్తున్నారు. ఆ పిల్లల్ని చూస్తుంటే సుజాత మనసు తేలికై అప్రయత్నంగా చిరునవ్వు పెదవుల మీద ప్రవేశం చేసింది. పరిసరాలన్నిటినీ పరికిస్తూ, మనుషులను పరిశీలనగా చూస్తూ తన సంగతి మర్చిపోవాలని చూసింది.

సుజాతకు నాలుగైదు అడుగుల దూరంలో యిద్దరాడవాళ్ళు కూర్చున్నారు. ఇద్దరూ నిశ్శబ్దంగా ఏదో ఆలోచనలో మునిగినట్లు కూర్చున్నారు. అందులో ఒకామె చూస్తే మళ్ళీ చూడాలనిపించేంత అందంగా వుంది. అందం అనే మాట సరికాదేమో చాలా హుందాగా ఉంది. చామనఛాయ, మెరుపుతో కూడిన కళ్ళు, బొద్దుగా వుంది. పెద్ద జుట్టుని అందమైన ముడిగా చుట్టుకుంది. రెండుసార్లు ఆమెను పరిశీలనగా చూసి సుజాత మళ్ళీ తన విషాదంలో తను పడిపోయింది. ఇంతకు ముందైతే అలా తన దృష్టికి ప్రత్యేకంగా కనిపించిన వాళ్ళను చాలాసేపు గమనించి వాళ్ళ పోలికలను గుర్తుపెట్టుకుని తను వాళ్ళ స్కెచ్‌లు గీయటానికి ప్రయత్నించేది. ఇప్పుడు పెన్సిల్ పట్టుకుని పదినెలలయింది.

రాజారావు చెప్పే కుంటిసాకులు తనెందుకు వినాలి ఈసారి తాడో పేడో తేల్చుకోవాలి. తను ప్రేమగా కావిలించుకునే చేతుల్తో, ముద్దు పెట్టుకునే మూతితో ఆ ఏబ్రాసి భార్యను బాధ్యత కోసమైనా సరే ఎలా కావలించుకుంటాడు ? ఎలా ముద్దు పెట్టుకుంటాడు ? నన్ను ప్రేమిస్తున్నాడంటే యిక అతను తన సొంతం. అట్లా కాకుండా తనెందుకు సహించాలి ?

సుజాతకు తల్చుకుంటే దుఃఖం ఆగడం లేదు. కళ్ళనీళ్ళు పైకి రాకుండా విశ్వ ప్రయత్నం చేస్తోంది.

"ధనలక్ష్మీ ! నువ్వు కూడా రాజారావులా మూర్ఖంగా ఉండకు. మనసు దిక్కబట్టుకో. కష్టాలు ఎలా వస్తాయో అలాగే పోతాయి. దేవుడిమీద భారంవేసి వూరుకో. ధనలక్ష్మి ఎంతో అదృష్టవంతురాలని అందరూ అనుకుంటుంటే నీకీ బెడద వచ్చి పడిందేమిటి ?"

సుజాతకు నాలుగైదడుగుల దూరంలో కూచున్న ఆ అందమైన ఆవిడతో పక్కావిడ మాట్లాడుతోంది.

ఆ మాటలు వింటున్నకొద్దీ సుజాత తల గిర్రున తిరుగుతోంది.

ధనలక్ష్మంటే ఈవిడా ? రాజారావు భార్య ఈవిడేనా ? ఇంత అందంగా హుందాగా ఉంటుందా ఆ రాజారావు భార్య

సుజాత కళ్ళూ, మనసూ ధనలక్ష్మి పరంచేసేసి అట్లాగే చూస్తూండి పోయింది.

ఆ ఇంకొకావిడ మాటలు మానేసి వెళ్ళటానికని లేచి నిలబడింది.

"నేను కాసేపు కూచుని వస్తాను నువ్వు వెళ్ళు వదినా" అంది ధనలక్ష్మి.

ఆ మాటల్లో నిదానమూ, పలికే తీరులోని సంస్కారమూ సుజాత దృష్టిని దాటిపోలేదు.

ఆ రెండో ఆమె వెళ్ళిపోయింది. ధనలక్ష్మి ఒంటరిగా విచారంగా కూచుని వుంది సుజాత లాగానే. సుజాతకు ఆమెనలాగే చూడబుద్దేస్తోంది. క్రమంగా ఆమె కళ్ళల్లో నీరునిండి చెంపల మీదకు జారింది. సుజాత తన చెంపలు తడిమి చూసు

కుంటే తడిగా తగిలాయి. పదిహేను నిమిషాలలాగే ధనలక్ష్మిని చూస్తూ ఆమెతో పాటు ఆమెకు తెలియకుండా కన్నీరు కార్చింది సుజాత.

ధనలక్ష్మి వెళ్ళటానికి లేచింది. సుజాత కూడా లేచి ఆమె వెనకే నడిచింది.

ధనలక్ష్మి వెళ్ళి బస్‌స్టాప్‌లో నిలబడింది. సుజాత, ఆమె పక్కనే! బస్‌స్టాప్‌లో యిద్దరే ఉన్నారు.

ధనలక్ష్మి తన వంకే చూసేసరికి సుజాతకు ఒక్కసారి పెద్ద దడ వచ్చి తగ్గింది.

ఆ దడను జయించాలనే పట్టుదలకు ధనలక్ష్మిని పలకరించాలనే కోరిక తోడ యింది. ఇక నిగ్రహించుకోలేక పలకరించింది సుజాత.

"మీరెక్కడి కెళ్ళాలి ?"

"విజయ్ నగర్ కాలనీ" ధనలక్ష్మి మర్యాదగా సమాధానం యిచ్చింది.

సుజాతనూ అదే ప్రశ్న అడిగింది. సుజాత చెప్పింది.

సుజాత ఒక్కొక్కటే వివరాలు అడిగింది. ఆమె చెప్పింది. సుజాత వివరాలు తెలుసుకుంది.

సుజాతకు పెళ్ళి కాలేదని తెలుసుకుని

"అదృష్టవంతులు" అంది.

"అదేంటి" అన్నది సుజాత కుతూహలంగా.

"పెళ్ళయితే అన్నీ బాధలే" అంది దిగులుగా.

"మీ బాధేమిటి ?" సుజాత చనువుగా అడిగింది.

"మా ఆయన్ని ఎలా చంపుదామా అని ఆలోచిస్తున్నాను. అంతకంటే పెద్ద బాధ యింకోటి చెప్పండి" దిగులుగా నవ్వింది.

"మీకు అభ్యంతరం లేకపోతే మా యింటికి రాగూడదూ. ఈ పక్కనే" స్నేహంగా అడిగింది సుజాత.

సుజాతకు తన కళ్ళల్లో స్నేహం చాలా తేలికగా పలుకుతుందనీ అవతలి మనిషిలో ఏ కొంచెం స్నేహస్వభావం వున్నా తన కళ్ళు వాళ్ళని కదిలిస్తాయనీ తెలుసు. సుజాత నమ్మకం వమ్ముకాలేదు. ధనలక్ష్మి సుజాత యింటికి వచ్చింది.

సుజాత యింటినీ ఆ యింట్లో చీకూ చింతా లేకుండా బతుకుతున్న సుజాతనూ చూసి అసూయపడింది. ఆ సంగతి సుజాతతో కూడా చెప్పింది.

తర్వాత నెమ్మదిగా తనకూ తన భర్త రాజారావుకూ వచ్చిన గొడవ చెప్పింది.

"ఏడాదినుంచీ ఏడ్చి ఏడ్చి విసుగు పుట్టింది. ఆ మనిషంటే విరక్తి వచ్చేసింది. పిల్లలకోసం కూడా యింక ఆలోచించాలనిపించటంలేదు. విడాకులిచ్చేస్తానని రేపో మాపో చెప్పేస్తాను."

"ఎందుకివ్వాలి మీరు విడాకులు ? మీకేం తక్కువని ? ఆయన మిమ్మల్ని బాధపెడుతున్నారు. ఆయన మీ హక్కు, మీ సొంతం. వేరే వాళ్ళకు ఎందుకు వదుల్తారు ?" సుజాత తనను తాను కంట్రోలు చేసుకోలేకపోతోంది.

"నేనూ ఏడాదినుంచీ అలా అనుకునే పోట్లాడుతూ వచ్చాను. ఇంక ఓపిక లేదు. ఇట్లా పోట్లాడటంలోనే నా జీవితం తెల్లారుతుందని భయంగా ఉంది. మనుషుల్ని ఎవర్నయినా సొంతం అనుకోకూడదేమో. పేగు తెంచుకు పుట్టిన పిల్లలే మన సొంతం కాకుండా పోతున్నారు. మూడుముళ్ళు వెయ్యటానికి లక్ష రూపాయలు తీసుకున్న మనిషి ఎలా సొంతమవుతాడు ?" "లక్ష రూపాయలిచ్చారా ?" సుజాత ఆశ్చర్యపోయింది. "లక్ష రూపాయలకు ఒక్క రూపాయి తక్కువైనా ఈ సంబంధం గురించి ఆలోచించవద్దన్నాడు మా మామగారు మా నాన్నతో. లక్ష రూపాయలు, స్కూటరు, బీరువా, డైనింగ్ టేబిల్, డబల్ కాట్స్ అన్నీ ఇస్తేగానీ తృప్తిపడలేదు. అంతా వ్యాపారం అనిపిస్తుంది ఇప్పుడాలోచిస్తే. ఆ వ్యాపారంలో అంతా లాభమే అనుకున్నాను. పూర్తిగా దివాళా తీశానని ఇప్పుడనిపిస్తోంది" తమాషాగా నవ్వింది.

"ఐతే ఏం చేస్తారిపుడు ?"

ఆవిడకు తనెవరో చెప్పి రాజారావుతో తను తెగతెంపులు చేసుకుంటానని చెబుదామన్నంత ఆవేశం వచ్చింది సుజాతకు. కానీ చెప్పలేకపోతోంది.

"ఆయన్నుంచి విడిపోయి ఏదన్నా ఉద్యోగం చేసుకుని బతుకుదామనుకుంటున్నా. పిల్లల్ని ఏ హాస్టల్లోనన్నా చేరుస్తాను."

సుజాతకు తనకేమయిందో అర్థం కావటంలేదు. రాజారావు తన సొంతం కాడన్న మాట స్వయంగా అతని భార్యే చెబుతుంటే తనకు ఆనందం ఎందుకు కలగటం లేదో, తన గుండె ఎందుకిలా నీరవుతోందో సుజాతకు అంతుబట్టడంలేదు.

"నేను బి.కామ్ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. ఎక్కడన్నా ఉద్యోగం ఉంటే చూస్తారా ? టైపు కూడా వచ్చు. ఇప్పటికిప్పుడు స్పీడు కొట్టలేనేమో గాని పది రోజుల్లో పికప్ చెయ్యగలను."

సుజాతకు కన్నీళ్ళు ఆగటం లేదు.

"అయ్యో ! మీరెందుకు బాధపడుతున్నారు ?" అంటూ ధనలక్ష్మి ఓదార్చింది. అప్పుడు కూడా సుజాత అసలు విషయం మాట్లాడలేకపోయింది. కాసేపుండి తన అడ్రస్ రాసిచ్చి వెళ్ళిపోయింది ధనలక్ష్మి.

సుజాత వెంటనే ఓ వారం రోజులకు సరిపడా బట్టలు సూట్‌కేసులో సర్దుకుని గీతా వాళ్ళింటికి బయల్దేరింది.

"రాజారావుని చూడను. చూడలేను. అతనిప్పుడు వస్తే ఎలా ?" ఆటో ఎక్కి గీత యిల్లు చేరింది. గీత సుజాత చెప్పిన విషయం విని నిర్ఘాంతపోయింది.

"అన్నీ ఇలాంటి చిక్కులొస్తాయేంటి నీకు ? రాజారావు బరువే ఒద్దని నేను చెబుతుంటే ఇప్పుడు వాళ్ళావిడ బరువు మీద వేసుకొచ్చావు. నీకు సుఖపడే రాత లేదు" అని నిట్టూర్చింది గీత.

వారం రోజులపాటు రాజారావుని తప్పించుకుని తిరిగింది సుజాత. ఆఫీస్ ఫోన్‌లో కూడా దొరక్కుండా జాగ్రత్తపడింది. వారం తర్వాత ఆదివారంనాడు ఇంటికి వెళ్ళింది. తీరిగ్గా ఇల్లు ఊడ్చుకుని, తుడుచుకుని స్నానం చేసింది. ఏ పని చేస్తున్నా సుజాతకు ఇప్పుడొకటే ఆలోచన. రాజారావుతో ఎంత తొందరగా, ఎంత తక్కువ కష్టంతో తెగతెంపులు చేసుకోవటమా అని. ఈ ఆలోచనల్తోనే పాలు పొంగబెట్టింది. కూర మాడబెట్టింది. మాడిన కూరను పైపైన తీసి చిన్న గిన్నెలో వేస్తుండగా తలుపు తట్టిన చప్పుడయింది. వెళ్ళి తలుపు తీస్తే ధనలక్ష్మి. సుజాతకు చాలా భయం వేసింది. ధనలక్ష్మి జీవితంలో కల్లోలం రేపింది తనేనని ఆమెకు తెలియటం అనే ఊహనే సుజాత భరించలేకపోతోంది.

సుజాత భయాలను పటాపంచలు చేస్తూ ధనలక్ష్మి స్నేహంగా నవ్వింది. సుజాత తెరిపిన పడ్డట్టయి ధనలక్ష్మిని లోపలికి ఆహ్వానించి కూర్చోబెట్టింది.

ధనలక్ష్మి తను రాజారావుని వదలి వెళ్ళిపోతున్నాననీ, పిల్లల్ని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్చాననీ, కొన్ని రోజులు పుట్టింట్లో వుండి ఉద్యోగ ప్రయత్నాలు స్తాననీ చెప్పింది.

"ఆడవాళ్ళు చాలా తెలివితక్కువగా ఉంటారనటానికి నేనే పెద్ద ఉదాహరణండీ. భర్తనుంచి విడిపోవాలనుకున్నప్పుడల్లా పిల్లల్ని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాలనుకుని మళ్ళీ ఆ ఆలోచన రావటమే పాపంగా భయపడేదాన్ని. పిల్లలు హాస్టల్లో వుండటం భయంకరమైన విషయంగా అనిపించేది. నిన్న నా పిల్లల్ని చేర్పించటానికి వెళ్ళానా? ఎంతమంది పిల్లలో. అందులో విడాకులు తీసుకున్న తల్లిదండ్రుల పిల్లలు ముగ్గురున్నారు అంతే. తల్లిదండ్రులు కలిసి వుంటూ పిల్లల్ని హాస్టల్‌లో చేర్పిస్తున్నపుడు లేని గిల్టీనెస్ విడిపోయినపుడు చేర్పిస్తే ఎందుకుంటాలో అర్థంకాదు. అక్కడ పిల్లల్ని చూశాక నా పిల్లలకు మంచి స్నేహితులు దొరుకుతారనిపించింది. నా గుండెల మీదనుంచి చాలా బరువు దిగిపోయింది. నాకు ఇక్కడగాని మా ఊర్లోగాని ఉద్యోగం దొరికితే బాగుండు" అంటూ చాలా ఆత్మ విశ్వాసంతో మాట్లాడింది ధనలక్ష్మి.

ఆ ఆత్మవిశ్వాసం రాజారావు పరిచయం కాకముందు సుజాతలో ఉండేది. రాజారావు జీవితంలోకి వచ్చాక సుజాతకు ఎప్పుడూ భయమే. ఎప్పుడూ సందేహమే. ఎప్పుడూ భద్రత లేని తనమే.

ధనలక్ష్మిని చూస్తున్నకొద్దీ వీలైనంత తొందరగా రాజారావు నుంచి బైట పడాలనిపించింది సుజాతకు.

ధనలక్ష్మి వెళ్ళిపోయిన మర్నాడు రాజారావుని కలుసుకుంది. భార్యతో తెగ తెంపులైన విషయం చెప్పి సుజాతను సంతోషపెడదామని వచ్చిన అతనికి సుజాత చెప్పిన మాటలు పిడుగుపాటులా తోచాయి.

"నీకోసం ధనలక్ష్మిని ఒదులుకున్నాను" అన్నాడు సుజాత మాటల్ని నమ్మలేనట్లు.

'ఎవరు ఎవరిని ఒదిలారో తెలుసులే' అనుకుంది సుజాత మనసులో. పైకి మాత్రం ఆ విషయం తన కనవసరమంది. రాజారావుకి బాగా కోపం వచ్చింది. బెదిరించాడు. సుజాతకూ తనకూ మధ్య జరిగింది అందరిలో ప్రచారం చేసి అల్లరి చేస్తానన్నాడు. ఆఫీసులో, స్నేహితుల్లో సుజాత తల ఎత్తుకోకుండా చేస్తానన్నాడు. సుజాత "నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో" మంది.

"నేను పోగొట్టుకున్న స్వేచ్ఛను, నామీద నాకున్న నమ్మకాన్ని పొందటానికీ, ఇన్‌సెక్యూరిటీ నుంచి బైటపడటానికీ మూల్యం చెల్లించాల్సివస్తే చెల్లిస్తా....

కానీ నీ బంధంలో చిక్కుకుని జీవితాంతం ఆ బంధం ఎక్కడ తెగుతుందోననే భయంతో బతకటానికి సిద్ధంగాలేను" అని గట్టిగా చెప్పింది.

సుజాత మాటలు రాజారావుకి అర్థంకాలేదు. బహుశా ఆడవాళ్ళకు తాము భద్రత కల్పిస్తున్నామనే భ్రమలో వున్న మగవాళ్ళెవరికీ సుజాత మాటలు అర్థం కావు. అలాగే మగవాడివల్లే భద్రత కలుగుతుందని అనుకునే ఆడవాళ్ళకీ అర్థం కావు. సుజాత అనుభవం సుజాతకీ పాఠం నేర్పింది. అది అందరికీ అర్థమవటం కష్టమే.

సుజాతకు ఆ నెలంతా చికాకుగానే గడిచిందిగానీ రాజారావు బెడద వదిలింది. పాపం అతని దృష్టిలో రెంటికీ చెడ్డాడు. ఆ వూరినుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళాడు.

ఎప్పుడన్నా సుజాత "పాపం రాజారావు" అనబోతే గీత అడ్డుపడి,

"మగాడి గురించి ఎందుకే అంత జాలిపడతావు? అతని విశాల వక్షస్థలం మీద తలవాల్చి అతని బాహువుల్లో భద్రత పొందటానికి లక్ష రూపాయలతో సహా రావటానికి మళ్ళీ ఓ అబల సిద్ధంగానే వుండి వుంటుంది" అనేది.

"ఈసారన్నా కట్నం లేకుండా ఏ పేదింటి పిల్లనో చేసుకుని బుద్ధిగా వుంటే పోతుందిగా" అనేది సుజాత.

"మళ్ళీ నువ్వు ఆ పేదింటి పిల్ల భారాన్ని కూడా నెత్తిన వేసుకుందామని ఆశపడుతున్నావా?" అని నవ్వేది గీత.

గీతా, సుజాతా కలిసి ధనలక్ష్మికి ఒక ఉద్యోగం చూశారు. ధనలక్ష్మి తన తల్లిదండ్రులను ఒప్పించి వచ్చి ఆ ఉద్యోగంలో చేరింది. ఇద్దరాడవాళ్ళు స్వంతగా నడుపుతున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో చేరింది. సుజాత ప్రతి ఆదివారం ధనలక్ష్మి దగ్గరకు వెళ్ళేది. ఇద్దరూ కలిసి పిల్లల దగ్గరకు వెళ్ళేవాళ్ళు. వాళ్ళను తీసుకుని సినిమాకో, పార్కుకో వెళ్ళేవాళ్ళు. ధనలక్ష్మి చాలా స్నేహశీలి. ఆమెతో స్నేహం సుజాతకు ఎంతో హాయిగా వుంది.

ధనలక్ష్మికి వెయ్యిరూపాయల జీతం వచ్చేది. తను హాస్టల్లో కట్టి, పిల్లల ఫీజులు కట్టి డబ్బుకి చాలా యిబ్బంది పడేది. కోర్టులో కేసు తేలేవరకూ రాజారావు డబ్బు యివ్వనన్నాడు. అప్పటివరకూ తన పిల్లలు ఏం తింటారనుకున్నాడో. అంత

కఠినంగా మగవాళ్ళ మనసులెలా వుంటాయా అని ఆశ్చర్యపోయేవాళ్ళు. పిల్లలు హాస్టల్లో బా.గానే వుంటున్నా వాళ్ళ గురించి దిగులుతో ఏడుస్తూనే ఉండేది ధనలక్ష్మి.

ధనలక్ష్మికి యింకాస్త మంచి ఉద్యోగం దొరుకుతుందేమోనని సుజాత చూస్తుండగా ఒక రోజు ధనలక్ష్మి వచ్చి తను ఉద్యోగం మానేస్తున్నానని చెప్పింది. సుజాత ఆశ్చర్యపోతుండగా-

"నేనే ఒక వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నడుపుదామనుకుంటున్నాను" అంది. ఇపుడు తనుంటున్న హాస్టల్‌లో వందమంది ఉంటున్నారు. దీన్ని నడిపేది యిద్దరు ఆడవాళ్ళు. వాళ్ళకు నెలకు పది పదిహేను వేలు మిగులుతున్నాయి. తను యాభై మందితో మొదలుపెడితే బాగుంటుందని తన ప్లానంతా చెప్పింది. సుజాతకు చాలా ఉత్సాహం వచ్చింది. గీతతో కూడా చెప్పారు. ముగ్గురూ కలిసి ఇల్లు వెదికారు. డబ్బు అప్పు తెచ్చారు. కావాల్సినవన్నీ కొన్నారు. చక్కగా పబ్లిసిటీ యిచ్చారు. ముగ్గురి బుర్రలూ చురుకుగా పనిచేశాయి. తమ శక్తులన్నీ అందులో పెట్టారు. మొదటి నెలలో యిరవై మంది అమ్మాయిలు చేరారు. మూడో నెలకు డెబ్బయి మంది అయ్యారు. ఇక చోటులేదని ఎవరినీ చేర్చుకోలేదు.

ధనలక్ష్మిలో సామర్థ్యం అంతా ఆమె హాస్టల్ నడిపించే తీరులో తెలిసింది సుజాతకు. అంతమందిని ఒప్పిస్తూ మెప్పిస్తూ హాస్టల్ నడపటం తేలికకాదు. సుజాత కూడా యిల్లు ఖాళీచేసి హాస్టల్లో చేరింది. ధనలక్ష్మి చేతివంట తింటున్నపుడు మాత్రం సుజాతకు రాజారావు మీద జాలిముంచుకొచ్చేది. బాధ్యత లేకుండా ప్రవర్తించి ఎంత కోల్పోయాడో గదా అనిపించేది.

చూస్తుండగానే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పెట్టి సంవత్సరం గడిచింది. సుజాత, ధనలక్ష్మి, గీతలమధ్య స్నేహం బలపడింది. సుజాతకు అపుడపుడూ తనెవరో ధనలక్ష్మికి చెప్పాలనే కోరిక బలంగా పుట్టేది. కానీ చెప్పగలిగేదికాదు. చివరికి ఆరోజు రానేవచ్చింది. ధనలక్ష్మికూతురు పుట్టినరోజుని హాస్టల్‌లో అందరూకలసి చాలా వేడుకగా చేశారు. ధనలక్ష్మికి చాలా సంతోషంగా ఉంది. ఆమె బ్యాంక్ ఎకౌంట్ పెరుగుతోంది. పిల్లల్ని హాస్టల్‌నుంచి తెచ్చి తన దగ్గరే పెట్టుకుంది. వాళ్ళు తల్లిని చూసి గర్వపడుతున్నారు. మరి ఆమెకు సంతోషంకాక ఏముంటుంది?

ఆరోజు రాత్రి అంతా సద్దుమణిగాక ఆమె సుజాత గదిలోకి వచ్చింది.

"ఇదంతా నీ మూలంగానే. నేనీనాడు యింత హాయిగా వున్నానంటే నువ్వే కారణం" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. సుజాతకు అసలు విషయం యింక దాచాలని పించలేదు.

"రాజారావుకీ నీకూ గొడవలు రావటానికి కారణం నేనే. కానీ ఆ రోజు నిన్ను చూశాక, నీ మాటలు విన్నాక నాకు రాజారావుతో సంబంధంమీద ఆసక్తి పోయింది. అతనితో తెగతెంపులు చేసుకున్నాను" జరిగిన విషయమంతా చెప్పింది సుజాత. ధనలక్ష్మి నివ్వెరపాటు క్రమంగా తగ్గి నవ్వులోకి వచ్చింది. అంతా విన్నాక హాయిగా నవ్వేసింది. తల్చుకుని తల్చుకుని నవ్వింది.

"మీ మధ్యలోకి నేను రాననీ, నువ్వు రాజారావుతో కలిసి వుండమనీ చెబుదామా అనుకున్నాను. కానీ నేను తెగతెంపులు చేసుకున్న తర్వాత అతను నీ దగ్గరకు వస్తాడు. అపుడు నువ్వే తేల్చుకుంటావనుకున్నాను. నా ప్రమేయం ఒద్దనుకున్నాను" అంది సుజాత. ధనలక్ష్మి జీవితంలో కల్లోలం సృష్టించినందుకు క్షమాపణ అడుగుతుంటే ధనలక్ష్మి ఆపేసింది.

"నువ్వు చాలా మేలు చేశావని అంటుంటే నమ్మవేం?"

"ఏం మేలు? నీ జీవితం చిందరవందర అయిపోలేదూ? నువ్వు ఒక్కదానివీ ఏ అండా లేకుండా నిస్సహాయంగా నిలబడాల్సి వచ్చిందిగదా!" సుజాత ఆలోచనగా అంది.

ధనలక్ష్మి నిండుగా నవ్వింది.

"చిందర వందర, నిస్సహాయం! నిజంగానే రాజారావు నించి విడిపోక ముందు నా జీవితం చిందరవందరగా ఉండేది. అప్పుడే కాదు అసలు ఊహ వచ్చినప్పటినుంచీ పెళ్ళికాకముందు నుంచీ నా జీవితాన్ని ఏం చేసుకోవాలో తెలియక చిందరవందరగా గందరగోళంగా చేసుకునేదాన్ని. ప్రతిదానికీ నిస్సహాయంగా ఎవరో ఒకరివంక చూసేదాన్ని. నా కోసం వాళ్ళు ఆలోచించాలనీ, వాళ్ళు నిర్ణయాలు తీసుకోవాలనీ అనుకోవటం, మళ్ళీ అవి నచ్చక బాధపడడం. నాకిష్టం లేదని చెప్పలేక, చెప్పినా వినేవారు లేక నిజంగా అయోమయంగా వుండేది జీవితం. ఇవాళ నేనున్నంత సంతోషంగా గర్వంగా ఎప్పుడూ లేను. నా పెళ్ళప్పుడు నేనెంత టెన్షన్‌తో, దిగులుతో ఉన్నానో తెలుసా? కట్నం, లాంఛనాలు యిచ్చేదాకా ఆ దిగులు. అతని పద్ధతులన్నీ తెలుసుకుని వాటికలవాటుపడి అవి చాలా గొప్పవని నమ్మటానికి ఎంత

స్ట్రిగుల్ పడ్డానో చెప్పలేను. ఆ తర్వాత ప్రతిదానికీ అతనివంక చూడటం, అతని పర్మిషన్ అడగటం, అతనికెక్కడ కోపం వస్తుందోనని అనుక్షణం హడలిపోడం. ఆ తర్వాత అతన్ని పోగొట్టుకుంటానేమోననే భయం. ఏ రోజూ కంటినిండా నిద్ర లేదు. అతనితో విడిపోదామని నిర్ణయించుకున్న రోజునే మళ్ళీ నేను మనిషినవటం మొదలుపెట్టాను. ఇవాళైతే నాకు ఏ ఇన్‌సెక్యూరిటీ లేదు. నిజంగా ఎంత సంతోషంగా ఉన్నానో? అంతటికీ కారణం నువ్వే అనుకుంటే నిజంగా నీమీద ప్రేమ పెరిగిపోతోంది" అంటూ సుజాతను దగ్గరకు తీసుకుంది ధనలక్ష్మి. తమ జీవితాలకు తామే కర్తలమని తెలుసుకోవటంవల్ల వచ్చిన భద్రతాభావం వాళ్ళిద్దరి మనసులనిండా నిండింది.

★★
★